# సమాంతర రేఖలు



ఒకరోజు ఆమె దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. ఎన్నో ఏళ్ల తరవాత మూసుకుపోయిన బాల్యస్మృతుల పుటలు తెరుచుకొని ఆమె కని పించింది. ఉత్తరం చదువుతున్నంతసేపు ఏదో అనిర్వ చనీయమైన అనుభూతి పొందాను.

"సారథీ!

నిన్నటి రోజున నీ ఫోటో పేపర్లో చూశాను. నీ కథ క్రింద 'సారథి' అనే వ్యక్తి నువ్వని తెలిసి, 'చిన్ననాటి సారథి ఇంతటివాడు అయ్యాడా?' అని ఆశ్చర్య పోయాను. ఒక్కసారి నిన్ను చూడాలని ఉంది.

ఇట్లు
చంద్రకళ."

అదే ఆమె వ్రాసిన మొదటి ఉత్తరం. దానికి సమాధానం వ్రాయలేదు. కారణం నాకే తెలియదు. కాని, ఆ ఉత్తరంలోని పంక్తులవేపే చూస్తూ చంద్ర కళను గురించి ఆలోచిస్తూ కూర్చున్నాను. మళ్ళీ ఒకరోజు ఆమె దగ్గర నుంచి మరో ఉత్తరం వచ్చింది.

"సారథీ!

నా మొదటి ఉత్తరానికి సమాధానం వ్రాయలేదు. కారణం తెలియదు. 'చంద్రకళ' అనే పేరు నీ స్మృతులలో నుంచి చెరిగిపోయిందనే అనుకుంటున్నాను.

మన ఊరి బళ్లో నువ్వూ, నేనూ ఒకే తరగతి చదువుతూ ఉండేవాళ్లం. నువ్వు పిల్లికళ్ళపిల్ల అంటూ ఉడికించేవాడివి. నేను గట్టిగా వీపు చిట్లగొట్టేదాన్ని! ఒక రోజున మన బడి పక్కన ఉన్న మా దొడ్లో బొప్పాయి కాయలు కోసుకుపోతూంటే పట్టుకొని పంతులుగారికి అప్పగించాను. మూడు రోజులు గోడకుర్చీ వేయించారు! అంతే. నాతో మాట్లాడటం మానేశావు. ఇది జరిగిన కొద్ది రోజులకే మేం వైజాగ్ వచ్చేశాం. ఒక వారం రోజుల్లో నువ్వు ఇక్కడికి రాకపోతే నిన్ను చూడటా నికి నేనే బయలుదేరి వచ్చేస్తాను.

ఇట్లు
చంద్రకళ."

చంద్రకళ వ్రాసిన ఉత్తరం చదవడం ముగించాను. బాల్యస్మృతులు నా హృదయాన్ని చుట్టుముట్టి ఉక్కిరి బిక్కిరి చేశాయి. ఇరవై ఏళ్ల క్రిందట చంద్రకళ ఒక అపూర్వవ్యక్తిగా నాకు కనిపించేది. ఏడేళ్ల బాలికనా చంద్రకళ పొట్టి పొట్టి పాణీలు వేసుకుని, ఒకచేయి నడుంమీద పెట్టుకొని మరోచేత్తో బెత్తం పట్టు కుని, బడికంతటికి ఏకైక నాయకిలా ఉండేది. ఆమె మాటలకు, చేష్టలకు ఎదురులేదు. పిల్లలంతా ఆ పిల్ల ప్రాపకంకోసం అణిగి మణిగి ఉండేవారు. ఎప్పుడైనా ఆ పిల్ల కెదురుతిరిగి యుద్ధం ప్రకటించేది నేనొక్కడి ననే చెప్పుకోవచ్చు. చివరికి విడిపోయేటప్పుడు కూడా ఒకళ్లతో ఒకళ్లు మాట్లాడుకోకుండా, శత్రువులలాగే విడిపోయాము.

చంద్రకళకు ఉత్తరం వ్రాయడం మొదలు పెట్టాను.

"చంద్రకళా!

నీ రెండు ఉత్తరాలు అందాయి. నీ ఉత్తరాలు నా కెందుకో ఒక అనిర్వచనీయమైన ఆనందాన్ని కలిగి

బాల్యంలో భావముద్రలు అతి సులభంగా ఏర్పడతాయి. అవి చెరిగిపోవడం మాత్రం అంత సులభమేమీ కాదు. జీవితమంతా ఆక్రమించుకొనే ఈ భావముద్రలకు, వాస్తవానికి పొత్తు కుదరడం సాధారణంగా జరగదు.

---

చాయి. ఎడారి ఇసుక తిన్నెలో తీరని దప్పికగొన్న పాంథునికి ఒక నీటిచుక్క దొరికిన అనుభూతి పొందాను.

నువ్విక్కడికి రావద్దు. నేనే ఏదో ఒక క్షణంలో బయలుదేరి నిన్ను వెతుక్కుంటూ వస్తాను. ఆరోజు తప్పకుండా వస్తుంది. కానీ, అది ఎప్పుడో మాత్రం చెప్పలేను.

ఇట్లు,
సారథి."

చంద్రకళకు ఉత్తరం వ్రాసిన నాలుగు రోజుల వరకు చెప్పుకోదగ్గ విశేషాలు ఏమీ లేవు. ఒక కొత్త కథ ప్రారంభించాను. ఎందువల్లనో అది ముందుకు సాగడం లేదు. ఆలోచనలన్నీ చంద్రకళ మీదికే కేంద్రీకృత మవుతున్నాయి. మధ్యాహ్నం రెండు గంటలకు చంద్రకళదగ్గర నుంచి తిరిగి జవాబు వచ్చింది.

"సారథీ!

నీ ఉత్తరం అందింది. ఆకాశం నుండి జారిపడే ఒకానొక వర్షబిందువుకోసం చాతకి నోరుతెప్పి ఆకాశపు అంచుల్లోకి చూస్తూ నిరీక్షిస్తుంది. నేను నీ ఉత్తరంకోసం అలాగే నిరీక్షించాను. నా నిరీక్షణ ఫలించింది. ఈరోజు మండు టెండలో ఎంతో దూరంనుంచి వచ్చి ఉత్తరాల దొంతరల్లోంచి వెల్లని ఉత్తరం వెదికి ఇచ్చాడు. ఆ ఉత్తరం అందుకుని నువ్వు ఎరుగున్న పదేళ్ళబాలిక చంద్రకళలాగే ముప్పదిఏళ్ళ నేను గంతేశాను! ఏనాడూ ఏవ్యక్తీ తను ఉత్తరం ఇచ్చినపుడు అంతటి ఉత్సాహాన్ని పొందటం ఆ పోస్టుమన్ ఎరగడేమో?

నా ఉత్తరం ఎందుకంత ఉత్సాహాన్ని కలిగించిందని ప్రశ్నిస్తావేమో? చెబుతాను, విను. ప్రతి వ్యక్తికీ బాల్యస్మృతులు ఒక అపూర్వానుభూతిని కలిగిస్తాయి. అందులోకి అందర్నీ పోగొట్టుకొని తాను పుట్టిపెరిగిన ఊరికి కొన్ని వందలమైళ్ళ వతల ఏకాకిగా బతుకుతున్న ఒక ఆడదాని జీవితంలో ఎంతటి బలీయమైన అనందానుభూతుల్ని రేపుతాయో చెప్పతరంకాదు! ఆ అనుభూతుల్ని స్వయంగా అనుభవించాలేతప్ప ఒకళ్ళు చెప్పినా అర్థం కాదు.

నీ ఉత్తరంలో ఏదో ఒక క్షణం నన్ను వెదుక్కుంటూ బయలుదేరి వస్తానన్నావు. కాని, ఆ క్షణం ఎప్పుడు వస్తుంది? ఆ క్షణంకోసం నేను ఎలా నిరీక్షించేది? నిరీక్షణలోని బాధను నేను ఎలా భరించగలను? ఒకానొక నక్షత్రం నుండి బయలుదేరిన వెలుగు కిరణం భూమికి చేరేలోపుగానే ఆ నక్షత్రం నశిస్తుందట! ఆ క్షణానికి ఈ భూమి ఉంటుందో లేదో తెలియదు!

నీతో ఎన్నో చెప్పాలని, ఏవేవో అడగాలని నేను ఆరాటపడుతున్నాను. ప్రతిక్షణం నీ ఆగమనంకోసం ఎదురు చూస్తూ గడుపుతున్నాను.

ఇట్లు,
చంద్రకళ"

చంద్రకళ వ్రాసిన ఉత్తరాన్ని చదివి ఆలోచిస్తూ కూర్చున్నాను. ఏనాడో కలిసి చదువుకున్నాము. ఎప్పుడో విడిపోయాము. ఆ జ్ఞాపకాలు ఆ అనుభవాలు మరుపు రానివిగా మిగిలిపోయాయి. ఆనాటి చంద్రకళ ఒక అపూర్వ వ్యక్తిగా నా జ్ఞాపకాలలో మిగిలిపోయింది. కాని, ఈనాడు ఆమె ఉత్తరాలలో తన అసహాయతను, జీవితంపట్ల నిరాశను వ్యక్తంచేస్తున్నది. ఆమె జీవితం ఇలా ఎందుకు మారింది?

నాపై అంత అభిమానాన్ని కురిపిస్తున్నదెందుకు? ఆమె జీవితంలో ఏకాకిగా ఎందుకు మిగిలిపోయింది? ఏం సాధించడంకోసం?

ఆమెను గురించి అనేకమైన ప్రశ్నలు నన్ను చుట్టుముట్టాయి. అంతా అయోమయంగా గోచరించింది.

నాలుగు రోజుల తరవాత నా ప్రశ్నకు జవాబు కోరుతూ ఉత్తరం వ్రాశాను. ఉత్తరం వ్రాసింది మొదలు సమాధానంకోసం ఎదురుచూస్తూ కూర్చున్నాను. అనుకున్న రోజుకంటే ముందుగానే ఆమె దగ్గర నుంచి సమాధానం వచ్చింది.

"సారథీ!

నీ ఉత్తరం అనేక ప్రశ్నలతో నింపివేశావు. నిజంగా ఈనాటివరకు నా జీవితంపట్ల ఇంతటి అభిమానాన్ని చూపినవాళ్లెవరూ లేరు. నన్ను గురించి తెలుసుకోవాలనే ఆసక్తి చూపే ఒకానొక వ్యక్తి ఉన్నాడని తెలిసి నేనెంతో గర్వపడ్డాను.

కాని, నీ ప్రశ్నలకు సమాధానం నేను ఉత్తరంలో వ్రాయలేను. అందుకు నేను అశక్తురాలిని. నీ ఎదురుగా కూర్చుని స్వయంగా నా నోటితోనే నీకు వినిపించాలని ఆరాటపడుతున్నాను.

నా జీవితం వింతవింత మలుపులతో, వింతవింత సంఘటనలతో కూడుకున్నది. నేనెందుకు ఏకాకిగా మిగిలానని నీ ప్రశ్న. నీ ప్రశ్న లన్నింటికీ ఒకే సమాధానం —నా ఆదర్శాలకోసం.

నీ భార్య ఎలా ఉంటుంది? ఎంత అందంగా ఉంటుంది? ఎంతమంది పిల్లలు? వాళ్ళు ముచ్చటగా ముద్దుగా ఉంటారా?

ఇట్లు
చంద్రకళ."

చంద్రకళ ప్రశ్నలకు నాకు నవ్వొచ్చింది. నాకు భార్య లేనిదే పిల్లలు ఎలా ఉంటారు? పెళ్ళికానిదే భార్య ఎలా వస్తుంది?

ఇక్కడ చంద్రకళకు నాకు ఒకే భేదం. ఆమె ఆదర్శాలకోసం ఏకాకిగా మిగిలిపోతే, నేను నా స్వార్థం కోసం. అదే విషయాన్ని చంద్రకళకు వ్రాశాను.

"చంద్రకళా!

నేనూ నీలాగే జీవితంలో ఒంటరిగా మిగిలిపోయాను. కాని, నీలా ఆదర్శాలకోసం కాదు; నా స్వార్థంకోసం.

నిన్ను కలుసుకొనే క్షణం త్వరలోనే వస్తుందని ఆశిస్తున్నాను. నేనూ నీలాగే ఎన్నో కబుర్లు నీతో చెప్పాలని ఆరాటపడుతున్నాను.

ఇట్లు
సారథి."

అంతే. మళ్ళీ తిరిగి ఆమెవద్దనుంచి సమాధానం

ఉప్పులూరి సత్యనారాయణ

అనన్య సామాన్య ప్రచారం గల తెలుగు వార పత్రిక
ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక

మూలశంకకు
త్వరగా
నమ్మకమైన
హెడన్‌సాతో
చికిత్సను పొందండి
-శస్త్రచికిత్స
అవసరములేదు!

సహించలేని బాధ ఉందా? తీవ్రంగా దురద వుందా? మంటతో నెత్తురు పడుతుందా? అమోఘమైన చికిత్స ఎంతమాత్రము కాలయాపనచేయవద్దు! ఉపేక్షిస్తే తీవ్రమైన పరిస్థితులకు దారితీసి-శస్త్ర చికిత్స తప్పనిసరి ఔతుంది. సకాలంలో హెడెన్‌సాతో ఉపశమనాన్ని పొందండి, ఇది నమ్మకమైన జర్మను మూలశంక నివారణము. 108 దేశాలలో వైద్యులందరూ శిఫారసు చేస్తున్నారు. హెడెన్‌సా శీఘ్రంగా గుణాన్నిచ్చి బాధను దురదను శమింపజేస్తుంది-విరేచనము ఎంతమాత్రము కష్టమనిపించదు. హెడెన్‌సాలో ఉండే అమోఘమైన మందులు సామర్థ్యంగా గుణాన్ని కలిగించి రక్త శంకలను ముకుళింప జేసి ఆరోగ్యకరమైన టిస్యూ రంధ్రాల ప్రవృద్ధికి సహకరిస్తుంది. గమనించండి. మూలశంకలకు సకాలంలో హెడెన్‌సా చికిత్స చేసుకుంటే శుస్త్రం శస్త్ర చికిత్స అవసర ముండదు!

హెడెన్‌సాలో మత్తును కల్గించే మందులు ఏమియు లేవు.


అసలైన జర్మన్ మాత్రాలకు అనుగుణంగా ఇండియాలో వీరిచే తయారు చేయబడుచున్నది:

ది డాలర్ కంపెనీ
337, తంబుచెట్టి స్ట్రీటు
మద్రాసు-1

ప్రసిద్ధి పొందిన కెమిస్టు అందరివద్ద లభిస్తుంది,

B3-DOL-2TE

BB. G. 61 TEL.




**బ్రైట్** ప్లాస్టిక్ సామగ్రి
అందమైనవి, అనువైనవి

బ్రైట్ ప్లాస్టిక్ సామగ్రి అందమైన ఆధునిక జీవనానికి సరిపోయేట్లు రూపొందించబడ్డాయి. వెలుపలికి వెళ్లి వస్తువులు కొంటున్నా, ఇంట్లో వంట చేస్తున్నా రోజంతా పనిచేస్తున్నా, విశ్రాంతి పుచ్చుకుంటున్నా, జీవితం ఆనందమయంగా, సుఖవుగా వుండేందుకు మీరు బ్రైట్ ప్లాస్టిక్ సామగ్రిపై ఆధారపడవచ్చు. ప్రతి వస్తువు ద్వివిధ రూపముతో కూడి యున్నది. ఒకటి ప్రకాశవంతమై ఆకర్షణీయముగా ఉండడం; మరొకటి అనువుగా, ప్రయోజనకరంగావుండడం. అందం మిత వ్యయము అనే అంశాల చక్కని కలయిక యిది. విభిన్న రుచులకూ, ప్రతి అవసరానికీ సరిపోయేట్లు అనేక రకాల వస్తువులు, ఎన్నో రంగుల్లో బ్రైట్ ప్లాస్టిక్ సామగ్రిలోవున్నాయి. అన్ని ప్రముఖ దుకాణములలో లభించును.

బ్రైట్ బ్రదర్స్ ప్రైవేట్ లిమిటెడ్,
158-ఎ, తార్దేవ్ రోడ్, బొంబాయి 34

బ్రైట్ సామగ్రి మీ సరియైన యెన్నిక



# సమాంతర రేఖలు

రాలేదు. ఎన్నో ఉత్తరాలు వ్రాసి విసిగిపోయాను. ఎంత తల బద్దలు కొట్టుకున్నా ఆమె సమాధానం వ్రాయటం ఎందుకు మానుకుందో, ఒక్కసారిగా నేనంటే అంత విరోధం ఎందుకు ఏర్పడిందో అర్థం కాలేదు.

నెలరోజులు నిస్సిస్తంగా గడిచిపోయాయి. ఈ నెల అంతా ప్రతి రోజూ ఆమె ఉత్తరం కోసం ఎదురు చూస్తూ కూర్చున్నాను. కాని, నా ఎదురుతెన్నులు ఫలించలేదు. ఆమె దగ్గర నించి ఏవిధమైన సమాధానము లేదు. నా శాంతి నశించింది. ప్రతిక్షణం ఆమెను గురించిన ఆలోచనలే. నా జీవితంలో అకస్మాత్తుగా ప్రవేశించింది. చిన్ననాటి స్నేహాన్ని, అనుభవాల్ని రెచ్చగొట్టి నా మనస్సును కదిపివేసింది, హఠాత్తుగా విస్మరించింది.

ఆమెను గురించి మరిచిపోవాలని నిర్ణయించుకున్నాను. ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయింది. ప్రతిక్షణం నా నిర్ణయం గంగలో కలిసిపోయేది ఏదో అశాంతి, అసంతృప్తి నన్ను మింగివేస్తున్నాయి.

ఏపనీ చేయ బుద్ధి పుట్టడం లేదు. కాగితంమీద కలం పడవడం లేదు. నా ఊహాశక్తి నానించి అంతర్థానమైనట్టు నా వేదనలో ఎత్తుకుపోయినట్టు ఫీలవుతున్నాను. ఒక్క కథ వ్రాయలేకపోయాను.

రెండు నెలల తరవాత ఒక కవరు వచ్చింది. విప్పి చూశాను, కాని, ఆ అక్షరాలు నాకు పరిచితమైనవికావు. ఉత్తరం వ్రాసిన వ్యక్తి కూడ నాకు అపరిచితురాలే. నన్ను ప్రతిక్షణం ప్రశ్నలతో, అనేక సందేహాలతో వేధించే అసంఖ్యాకమైన పాఠకుల ఉత్తరాలలో ఇదొకటి అనే ధోరణిలో చదవ నారంభించాను. కాని, ఆ ఉత్తరం వ్రాసినవ్యక్తి వసంత అయినా, ఆమె వ్రాసిన దంతా చంద్రకళను గురించే.

"సారథిగారూ!

నేను మీకు అపరిచితురాలినే. అయినా చంద్రకళతో మీకున్న పరిచయాన్ని ఆధారంగా తీసుకుని, ఆమె శ్రేయోభిలాషిణినయిన నేను సాహసించి ఈ ఉత్తరం వ్రాస్తున్నాను.

చంద్రకళ రెండు నెలల క్రిందట ఒకానొక ప్రమాదంలో చిక్కుకొని స్పృహ కోల్పోయింది. తిరిగిరెండు నెలలనుంచి స్పృహ రాలేదు. డాక్టర్లు ప్రాణాపాయం లేదని చెబుతున్నారు.

ఆమె ఒకరోజున తను ఈ ప్రపంచంలో ఏకాకినని, తనకు నా అనేవాళ్ళుకాని, తనను అభిమానించే వాళ్ళు కాని ఎవ్వరు లేరని చెప్పింది. కొన్నాళ్ళ తరవాత తనను అభిమానించే వ్యక్తి, తనకు కావలసిన వ్యక్తి ఒకానొక మనిషి ఉన్నాడని, అతడే మీరని చెప్పింది. మీ ఉత్తరాలు నాకు చూపింది. ఈవేళ ఆమె డైరీమీద వ్రాసుకున్న మీ అడ్రసు దొరికింది. ఈ సమయంలో మీకు ఆమె సమాచారాన్ని అందించడం నా ధర్మమని భావించాను. ఇప్పటికే చాలా ఆలస్యమైనదనుకుంటాను.

ఒక విషయం. ఆమె మీరనుకున్నంత సామాన్యురాలు కాదు. ఆమె లక్షలాది పాఠకుల హృదయాల్ని చూరగొన్న మహత్తర రచయిత్రి. 'జ్వాలాముఖి' అన్న పేరు నేను మీకు పరిచయం చేయనక్కర లేదు. మీకు పరిచితురాలైన 'జ్వాలాముఖి', మీ చింతాల పరిచితురాలు,

చిన్ననాటి నేస్తం 'చంద్రకళ' ఒక్కరే. ఇట్లు, వసంత."

ఉత్తరం చదివి ఆశ్చర్యంలో మునిగి తేలాను. చంద్రకళ మొదటిసారి ఒక పాఠకురాలులా నా కథను అభినందిస్తూ అనాయాసంగా ఉత్తరం వ్రాసింది. కాని అసంఖ్యాకమైన ఆమె అభిమాన పాఠకులలో నేను ఒక వ్యక్తినని ఈనాటివరకు తెలుసుకోలేక పోయాను. నన్ను ఉత్తేజపరిచి, రచనా వ్యాసంగంలో దింపి నన్నింతవాణ్ని చేసినవి జ్వాలాముఖి రచనలే! నేను ఆమెకు అజ్ఞాతంగా ఋణపడి ఉన్నాను.

చంద్రకళ ఈనాటికీ అపూర్వవ్యక్తే. ఆమె క్షేమం కోసం ఎంతగా వ్యథచెందాను! ఆమె దగ్గరనించి సమాధానాలు రాకపోతే ఎంతగా దూషించాను!

ఆ స్థితిలో ఆమెను చూడడానికి నా అంతరాత్మ అంగీకరించలేదు. అప్పటికి వాయిదావేసి నిర్లిప్తంగా ఉండిపోయాను. కాని ప్రతిక్షణం ఆమె క్షేమాన్నిగురించి తల్లడిల్లిపోతూండేవాణ్ని.

ఒకరోజున వసంత దగ్గరనించి టెలిగ్రాం వచ్చింది. ఎందుకో సంతకం చేస్తూంటే చేతులు వణికాయి. నా హృదయం ఒక్కసారిగా కుంగిపోయినట్టయింది. విప్పి చదివాను.

"చంద్రకళకు స్పృహ వచ్చింది. మిమ్మల్ని చూడాలని ఆరాటపడుతూంది. ఇరవై నాలుగు గంటలు బతికితే, ఇక బతికినట్టేనని డాక్టర్లు చెబుతున్నారు. త్వరగా బయలుదేరాలి.... వసంత."

రాత్రికి రాత్రి టాక్సీలో బయలుదేరాను. టాక్సీ వైజాగ్ వైపు దూసుకుపోతూంది. నా మనస్సు, నా హృదయం చంద్రకళ ముందుఎప్పుడు వాలతానా అని ఆరాటపడుతున్నాయి!

నాకు భగవంతుడిమీద ఏనాడూ నమ్మకం లేదు. ఏనాడూ చెయ్యెత్తి మొక్కలేదు. కాని, ఈనాడు చంద్రకళను బతికించమని భగవంతుడికి చెయ్యెత్తి నమస్కరించి, పదేపదే వేడుకున్నాను.

టాక్సీ దిగి గబగబా లోనికి పరిగెత్తాను. నంబర్లు వెతుక్కుంటూ ఆ గది దగ్గిరికి వెళ్ళాను. గది బయట పాతికేళ్ళ యువతి లోతుకుపోయి, ఏడ్చి ఏడ్చి కన్నీరింకిపోయిన కళ్ళతో నిలుచుని ఉంది. ఆమె నన్ను గుర్తుపట్టింది.

"మీరు 'సారథి' అనే అనుకుంటాను" అంది.

"అవును! అవును!. నేనే, సారథినే! నా చంద్రకళ ఎక్కడ? త్వరగా పదండి!" అన్నాను.

నా మాటలు విని ఒక్క పాలినవ్వు నవ్వింది.

"యూ ఆర్ టూ లేట్! ఇక మీరు కంగారు పడనక్కర లేదు. ఆమె కొద్ది నిమిషాల క్రిందటే ఈ లోకాన్ని వదిలి వెళ్ళిపోయింది!" అంది.

తెల్లటి ముసుగు తీసి ఆమె ముఖం చూపించింది. నా చిన్ననాటి నేస్తాన్ని, నా చంద్రకళను గుర్తుపట్టాను.

"చంద్రకళా!" అని అరిచాను వెర్రిగా. సమాధానం రాలేదు. ఆమె ఉత్తరాలలోని ఒక వాక్యం మాత్రం గుర్తుకు వచ్చింది.

"ఒకానొక నక్షత్రంనుండి బయలుదేరిన వెలుగు కిరణం భూమికి చేరేలోపుగానే ఆ నక్షత్రం నశిస్తుందేమో! లేదా......" ★


అంతకంత కెక్కువమంది గృహిణులు
ఆనందంగా వంటచేసుకునేందుకు
కాల్ గాస్ వాడుతున్నారు



కాల్‌గాస్‌ను వంటింట్లో పెట్టుకు వంటపని ఎంత ఆనందంగా ఉండగలదో తెలుసుకొనండి. కాల్‌గాస్ ఉపయోగించడం తేలిక...క్షణంలో వెలుగుతుంది...తక్షణమే వేడినిచ్చి మీ వంట కాలాన్ని గంటలకొద్దీ తగ్గిస్తుంది...ఇది పొడిమి అయినదికూడా...కాల్‌గాస్ శుభ్రమైనది...మసి ఉండదు...పొగరాదు...ఉదుకున్నవు తోముకోటం ఉండదు.

కాల్‌గాస్ భద్రమైనది

కాల్‌గాస్ మీకు భద్రమైన ఉక్కు సిలెండర్లలో ప్రత్యేకమైన కాపుదల టోపీలతో చేరుతుంది. ఇవి లీకేజిని, తప్పువాడకాన్ని లేకుండా చేస్తాయి.

*ఇంటిదగ్గర బట్వాడా చేసే సౌకర్యం ఉంది.*

**A CALTEX PRODUCT**

సోల్ డిస్ట్రిబ్యూటర్ : ఈస్ట్ కోస్ట్ గాస్ కంపెనీ

48/9/5, కో-ఆపరేటివ్ కాలనీ, ద్వారకానగర్, విశాఖపట్నం—4. ఫోన్ : 3516.

కనమెరా ఎనెక్స్, మౌంట్‌రోడ్డు, మద్రాసు—2. ఫోన్ : 83428.

ఏజెంట్లు ఉన్నచోట్లు : విశాఖపట్నం • మద్రాసు • విజయవాడ • కాకినాడ • ఏలూరు గుంటూరు • కటక్ • రాజమండ్రి • నెల్లూరు • గూడూరు (నెల్లూరు జిల్లా) • తిరుపతి బరంపురం • సిక్కోలు • విజయనగరం • మచిలీపట్నం • కట్పాడి • సేలం • పుదుచ్చేరి ఒంగోలు • దుర్గ్ • వరంగల్ • కాంచీపురం • భువనేశ్వర్.